క్లుప్తంగా

మహ్మద్ ప్రవక్త సందేశం అనుసరణీయం



మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడుస్తూ, వారి సందేశాలను ప్రతి ఒక్క ముస్లిం పాటించి అల్లాహ్ అనుగ్రహం పొందాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ప్రతి ఇంట్లో సంతోషాలు వెల్లివిరిసి, అందరికీ మంచి జరగాలన్నారు. పార్టీ యువ జన విభాగం రాయలసీమ చైర్మన్ ప్రణ య్ రెడ్డి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తేయాలి



తీర్మాన పత్రాన్ని చూపుతున్న సర్పంచ్

కూడేరు: నిరు పేదలకు నిస్వార్థంతో సేవలందిస్తున్న ఆర్డీటీపై కేంద్రప్రభుత్వం ఆంక్షలు ఎత్తేయాలని ఇప్పేరు సర్పంచ్ ఓబులేసు, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇప్పేరులో పంచాయతీ తీర్మానం చేసింది. ఆర్డీటీ పేదలకు అందిస్తున్న సేవలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

7న పెన్నహోబిలం ఆలయం మూసివేత

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం ఆలయాన్ని వచ్చే ఆదివారం సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్లు ఆలయ ఈవో తిరుమల రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మరుసటి రోజు సోమవారం స్వామికి సుప్రభాత సేవ, సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు.

6న పెన్నహోబిలం హుండీ లెక్కింపు

ఈ నెల 6న శనివారం ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామికి చెల్లించిన కానుకలు, ముడుపుల హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో తిరుమల రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతున్నారు.

వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హర్షలత

కళ్యాణదుర్గం రూరల్: వన్యప్రాణుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం వారు జాతీయ వన్యప్రాణి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హర్షలత మాట్లాడుతూ, వన్యప్రాణులకు హానికరం చేస్తే మానవుడి మనుగడకే ప్రమాదం అన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ సూర్యనాగిరెడ్డి, జంతుశాస్త్ర విభాగాధిపతి చాముండేశ్వరమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మోటార్ల కేబుల్ అపహరణ

బెళుగుప్ప: బ్రాహ్మణపల్లి తండా సమీపంలోని బోరుబావులకు అమర్చిన కేబుల్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకొని వెళ్లారు. సుమారు 12 మోటార్‌ల నుంచి స్టార్టర్ బాక్స్‌లకు అమర్చిన రాగి కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు పెట్రోల్ గోపాల్ నాయక్, రఘు నాయక్‌కు చెందిన స్టార్టర్ బాక్స్‌లను సైతం ఎత్తుకెళ్లారు. బాధితులు రాజు నాయక్, ప్రసాద్ నాయక్, మంజు, బలరాము, బి.గోపాల్, చంద్రనాయక్ తదితరులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దళితులపై దాడి తగదు



ఉలిగన్నను పరామర్శిస్తున్న సాకే హరి

విడపనకల్లు: దళితులపై దాడి చేయడం తగదని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉలిగన్నను సాకే హరి,దొడ్డప్ప, నరేంద్ర, మారెన్న పరామర్శించారు. సాకే హరి మాట్లాడుతూ మూడు రోజుల క్రితం విడపనకల్లులో ఉలిగన్నపై అదే గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన వారు మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. మూడు రోజులవుతున్నా ఇంత వరకూ దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరి కాదన్నారు.

వెదురు.. ఆదాయ వనరు

- మేదర కుటుంబాలకు ప్రధాన వృత్తి
- నిచ్చెనలు, బుట్టలు, చాటలు, తడకల తయారీతో ఉపాధి



వెదురుతో అల్లిన బుట్టలు, చాటలు



నిచ్చెన తయారు చేస్తున్న కార్మికుడు రమేష్

రాయదుర్గం: వెదురు.. ఎదురులేని ఆదాయం అన్నట్లు ఎంతో మంది మేదర కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తోంది. వెదురుతో నిచ్చెనలు, బుట్టలు, చాటలు, తడకలు.. ఇలా ఎన్నో రకాల వస్తువులు, గృహోపకరణాలు తయారు చేసి.. తద్వారా ఆదాయం గడిస్తున్నారు. అనేక కుటుంబాలు ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నాయి..రైతులే కాదు.. వాటి ఉత్పత్తులతో జీవనోపాధి పొందేవారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.

రాయదుర్గం పట్టణంలోని గత 40 ఏళ్లకు పైగా 50 కుటుంబాలు (మేదర) వెదురు వ్యాపారాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనూ మేదర్లు కొందరు ఈ వ్యాపారంతో ఉపాధి పొందుతున్నారు. కాదేది కళకు అనర్హం అన్న నానుడిని నిజం చేస్తూ .. వెదురుతో తయారు చేసిన ఎన్నో వస్తువులను మార్కెట్లోకి తెస్తూ తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం టిప్పుటూరు, హులియార, మంగళూరు తదితర ప్రాంతాల్లో వెదురు విరివిగా పండిస్తారు. ఆ ప్రాంతాల్లో లభించే వెదురును రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలోని వ్యాపారులు కొనుగోలు చేసి, నిల్వ చేస్తారు. వాటి ద్వారా 8 నుంచి 20 అడుగుల నిచ్చెనలు, చాటలు, బుట్టలు, జల్లలు, తడకలు, విసనకర్రలు ఇలా ఒకటేమిటి .. వెదురు కలపతో పందిళ్ల నుంచి వ్యవసాయ పరికరాల వరకు అనేక వస్తువులు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మార్కెట్లో వెదురు ఉత్పత్తులకు అదే స్థాయిలో డిమాండ్ ఎక్కువవుతోంది. భవిష్యత్తు ప్రతి వస్తువూ వెదురుగా మారే అవకాశం లేకపోలేదని వ్యాపారులు చెపుతున్నారు. ఇప్పటికే వెదరుతో తయారు చేసిన ఎన్నో వస్తువులు పట్టణ ప్రాంతాల్లో ఆకట్టుకుంటున్నాయి.

అలంకరణకు వెదురు కలప

గృహాలు, హోటళ్లు, రెస్టారెంట్ల అలంకరణలో వెదురు కలప వాడతారు. మంచాలు, కుర్చీలు, పెన్ స్టాండ్లను వెదురుతో తయారు చేస్తారు. హోటళ్లలో బ్యాంబూ చికెన్ (బొంగు చికెన్) తయారీకి వెదురు ఉపయోగిస్తున్నారు. మారిన కాలమాన పరిస్థితులకనుగుణంగా తయారీదారులు పలు రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వెదురు కొనుగోలు, రవాణాకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకం అందిస్తే మార్కెట్లోకి మరిన్ని వస్తువులు అందుబాటులోకి తీసుకురావడం సాధ్యమవుతుందని వ్యాపారులు అంటున్నారు.

40 ఏళ్లుగా ఇదే వృత్తి

40 ఏళ్లుగా మా కుటుంబం వెదురు వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. నిచ్చెనలతో పాటు బుట్టలు, చాటలు, జల్లలు, గంపలు, తడకలు, కుర్చీలు, పెన్ స్టాండ్లు లాంటివి తయారు చేసి విక్రయిస్తున్నాం. కర్ణాటక రాష్ట్రం తిప్పుటూరులో కలప కొనుగోలు చేసి తీసుకువస్తున్నాం. వెదురుకు మంచి డిమాండ్ ఉంది. భవిష్యత్తులో ప్రతి వస్తువు వెదురుతోనే తయారు కాబడుతుంది. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తూ రుణ సదుపాయం కల్పించాలి.

– రమేష్, నిర్వాహకుడు, రాయదుర్గం

తడిపొడి చెత్త సక్రమంగా తరలిస్తున్నారా?

- ప్రజలతో జెడ్పీ సీఈఓ శివశంకర్ ఆరా



ఇప్పేరులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

కూడేరు: పారిశుధ్య కార్మికులు రోజూ ఇంటింటా తడిపొడి చెత్తను సక్రమంగా తీసుకెళ్తున్నారా? అని జెడ్పీ సీఈఓ శివశంకర్ ఇప్పేరు గ్రామస్తులతో ఆరా తీశారు. గురువారం ఉదయాన్నే ఇప్పేరు గ్రామంలో జెడ్పీ సీఈఓ శివ శంకర్ పర్యటించారు. పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్న తడిపొడి చెత్తను తనిఖీ చేశారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ప్రతి రోజూ తప్పని సరిగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, చెత్తతో సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చూడాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. తడిపొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించి, సంపదను సృష్టించాలన్నారు. దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారినపడకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి పావని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- జిల్లా పరిశ్రమల శాఖ సహాయ సంచాలకుడు కె.రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ సహాయ సంచాలకుడు కె.రాజశేఖర్ రెడ్డి

కళ్యాణదుర్గం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని, ప్రతి ఒక్కరూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు కె.రాజశేఖర్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలోని మానస మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సు జరిగింది. సహాయ సంచాలకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలను అందిపుచ్చుకోవాలన్నారు. పారిశ్రామిక వేత్తలు ఎదిగేందుకు చక్కటి అవకాశమన్నారు. అనంతరం జిల్లా ప్రోత్సాహక అధికారి పి.రవీంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యత, స్వయం ఉపాధి పథకాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకొని తద్వారా పరిశ్రమల ఏర్పాటులో కీలకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పరిశ్రమల శాఖ అధికారులు శ్రీనికాంత, భువనేశ్వరిలు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ సిబ్బంది శ్రీనాథ్, హరీష్, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిగణేష్ శోభాయాత్ర



సాయిగణేషుడిని ఊరేగిస్తున్న దృశ్యం



డీజే ఆటపాటలతో హోరెత్తిస్తున్న యువకులు

కణేకల్లు: కణేకల్లులోని రామనగర్‌లో కొలువుదీరిన సాయిగణేష్ శోభాయాత్ర ఘనంగా జరిగింది. వినాయక చవితి రోజున భక్తులు సాయిగణేష్‌ను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. తొమ్మిదోరోజైన గురువారం సాయిగణేష్ శోభాయాత్ర నిర్వహించారు. చిన్నపిల్లలు కోలాటాలతో నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. డీజే ఆట పాటలతో యువకులు హోరెత్తించారు. భక్తిపారవశ్యంతో గణేష్ శోభాయాత్ర కనులపండువగా సాగింది. శోభాయాత్ర అనంతరం రాత్రి హెచ్చెల్సీ కాలువలో వినాయక నిమజ్జనం చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

యథేచ్ఛగా జూద కేంద్రాల నిర్వహణ



బ్రహ్మసముద్రం చెరువులో జూదం ఆడుతున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయి. మండలంలో టీడీపీ నేతలకు అండగా పోలీసులు వత్తాసు పలుకుతుండటంతో గ్రామాల్లో పేకాట, మట్కా మూడుపూలు ఆరు కాయలుగా నిర్వహిస్తున్నారు. పలువురు పోలీసులు మామూళ్ల మత్తులో జూద కేంద్రాలను ప్రోత్సహిస్తున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నారు. టీడీపీ నాయకులు స్థానిక చెరువులో పట్టపగలు పేకాట నిర్వహిస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఓ గ్రామంలో జూదరులు పట్టుబడితే అందులో అందరూ అధికార పార్టీ నాయకులే ఉన్నారు. మరో గ్రామంలో పేకాటలో పట్టుబడిన వాహనాలకు ఓ టీడీపీ నేత ఒక్కో వాహనానికి రూ. 5 వేలు చొప్పున వసూలు చేసి, స్టేషన్‌కు వాహనాలు వెళ్లకుండా చేసినట్లు సమాచారం.

నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష



సమీక్షలో పాల్గొన్న అధికారులు

ఉరవకొండ రూరల్: స్థానిక ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి తిప్పేనాయక్ ఆధ్వర్యంలో సీపీఓ యూనిట్‌తో గురువారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఉప రంగాల వారీగా 15 శాతం వృద్ధి సాధించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై నియోజకవర్గ ప్రత్యేక అధికారి తిప్పేనాయక్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలో యర్రగుంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్ఎం జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలేసి నివాళులర్పించారు. విద్యా ప్రాముఖ్యతతోపాటు గురుపూజోత్సవంపై హెచ్ఎం విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు హెచ్ఎం కానుకలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, కృష్ణకుమార్, వంశీకృష్ణ, గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.

తెలుగు భాషా ఔనత్యాన్ని చాటిచెబుదాం



మాట్లాడుతున్న జాగర్లపూడి శ్యామసుందర్

కుందుర్పి: తెలుగు భాషా ఔనత్యాన్ని చాటి చెబుతామని రాష్ట్ర తెలుగు భాషా ఉద్యమ సంయోజకులు జాగర్లపూడి శ్యామసుందర్, అష్టావధాని గురువేపల్లి నరసింహులు తదితరులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపీ చంద్, సర్పంచ్ రామూర్తి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి ఉపాధ్యాయులు సుబ్బరామప్ప, కృష్ణమూర్తి, హనుమంతప్ప, పెన్నోబులేసు, రాజేశ్వరి, మహేష్, ఓబుళమ్మ తదితరులు ఉన్నారు.

గుండె పోటుతో వృద్ధురాలు మృతి

కూడేరు: స్థానిక బస్టాండ్‌లో ఉరవకొండకు చెందిన దాసరి ఆదెమ్మ అనే వృద్ధురాలు గురువారం గుండె పోటుతో మృతి చెందారు. స్థానికులు, పోలీసులు సమాచారం మేరకు..ఆదెమ్మ కలగళ్ల రోడ్డు క్రాస్ వైపు నుంచి నడిచి బస్టాండ్ వైపు వెళ్లింది. కొద్దిసేపటికే ఆయాస పడుతూ నేలపై పడుకుంది. ఆ తర్వాత ఆమెలో కదలికలు లేకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్ఐ రామానాయుడు అక్కడికి చేరుకొని పరిశీలించారు. వృద్ధురాలు మృతిచెందినట్లు నిర్ధారణ అయిన తర్వాత ఆధార్ కార్డు ఆధారంగా అడ్రస్ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

మానవాళికి మార్గదర్శకం.. ప్రవక్త జీవితం



ప్రవక్త సమాధి ఉన్న మదీనా నగరంలోని మస్జిదే నబవి



విద్యుత్ దీప అలంకరణలో ఉరవకొండలోని ఆసార్ మకాన్

- నేడు మిలాద్ ఉన్ నబీ వేడుకలు
- మసీదుల్లో ప్రార్థనలు, జులూస్ కార్యక్రమాలు

రాయదుర్గంటౌన్ /ఉరవకొండ: వందల ఏళ్ల క్రితమే మానవాళికి మార్గ నిర్దేశం చేసిన మహనీయుడు అల్లా ప్ర వక్త మహమ్మద్(స). తన ఆదర్శజీవితంతో ప్రవక్తగా అల్లాహ్ మార్గం అనుసరణీయమని ప్రపంచానికి చాటి చెప్పారు. ఇస్లాం మతాన్ని స్థాపించిన చివరి ప్రవక్త మహమ్మద్ (స). ఈయన జన్మదిన వేడుకలనే మిలాద్ ఉన్న నబీగా ముస్లిం సమాజం జరుపుకుంటోంది. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో 571 సంవత్సరాల ఇస్లామిక్ మాసం రబ్బీవుల్ అవ్వాల్‌లో 12న ప్రవక్త జన్మించారు.

ఆధ్యాత్మిక భావాలు, తాత్విక చింతనతో జీవనం..

అల్లా ప్రవక్తగా శాంతి, ధర్మం, సమానత్వం, తోటి వారి పట్ల ఎలా మెలగాలో బోధించారు. వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకోవచ్చని, ఇరుగు పొరుగు, తల్లిదండ్రులు, కట్టుకున్న భార్యతో ఎలా మెలగాలి అనేక విషయాలపై స్పష్టమైన సందేశాలు ఇచ్చారు. ఆయన తన 40వ ఏట ప్రవక్తగా అల్లాహ్ నుంచి దూత జిబ్రయిల్ అలే సలాం నుంచి సందేశం లభించింది. 63 ఏళ్ల పాటు ఎంతో ఆధ్యాత్మికంగా, అత్యంత ఆదర్శవంతంగా అల్లా చూపిన మార్గంలో నడుస్తూ చివరకు రబ్బీవుల్ అవ్వాల్‌లో స్వర్గస్తులు కావడం విశేషం.

ప్రత్యేక ప్రార్థనలు, జులూస్ కార్యక్రమాలు..

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని అన్ని మసీదుల్లో గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం పుట్టిన రోజు వేడుకల సందర్భంగా అనేక ప్రాంతాల్లో కమిటీల ఆధ్వర్యంలో జులూస్ పేరుతో మక్కా, మదీన నమూనాలతో ఊరేగింపు నిర్వహిస్తారు.

నేడు జష్నే మిలాద్ ఉన్ నబీ జులూస్ ..

జష్నే మిలాద్ ఉన్ నబీ జులూస్ (ర్యాలీ)ను శుక్రవారం జయప్రదం చేయాలని గౌసే ఆజం మసీదు కమిటీ సభ్యులు, సున్నత్ వజ మాత్ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం కమిటీ సభ్యులు అబ్దుల్ వహాబ్, అబు బక్కర్, ఇస్మాయిల్, అబ్దుల్ హమీద్, బ్రెడ్ సర్మాస్, చమ్మా అస్లాం, హబీబ్, మహమ్మద్ షఫీ, అల్లాబకాస్, నిజాముద్దీన్, అహ్మద్ మాట్లాడారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం మసీదు వద్ద అన్నదానం ఉంటుందన్నారు.

మిలాద్ ఉన్ నబీకి ముస్తాబైన ఆసార్ మకాన్..

మహ్మద్ ప్రవక్త సొల్లాలాహు వలేహివ సొల్లెం జన్మదినాన్ని పురస్కరించుకొని ఉరవకొండలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆసార్ మకాన్‌ను రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్‌బాబాల ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు జామియా మసీదు వద్ద ఉన్న అసార్ మకాన్ నుంచి జెండా ఊరేగింపు ఉంటుందన్నారు. సాయంత్రం మహ్మద్ ప్రవక్త కేశఖండ ప్రదర్శన ఉంటుందన్నారు.

ప్రవక్త జీవితం ఆచరణీయం..

మానవ జీవితాన్ని సన్మార్గంలో నడిపించిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త (సొఅసొ) మనిషి ప్రవక్త మార్గంలో నడిస్తేనే జీవితానికి సార్థకత లభిస్తుంది. ప్రవక్త జీవితాన్ని పాటిస్తేనే అల్లా కరుణ సాధ్యపడుతుంది. తల్లిదండ్రులను గౌరవించడం, ఇస్లామిక్ ధర్మ సూత్రాలు ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్‌యాత్రలు తప్పనిసరిగా పాటించాలి. కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడాన్ని ఇస్లాం ప్రవక్త పెద్ద పీట వేశారు.

– మహమ్మద్ సైఫుల్లా,
ప్రభుత్వ ఖాజీ, రాయదుర్గం

వైఎస్సార్‌సీపీలో నయా జోష్

= అనుబంధ కమిటీల్లో పలువురికి చోటు



ఉరవకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది.

బీసీ సెల్ మండల కమిటీ: ప్రెసిడెంట్‌గా ధనుంజయ, వైస్ ప్రెసిడెంట్లుగా రామకృష్ణ, నీలప్ప, జనరల్ సెక్రటరీలుగా సంగమేష్, జగదీష్, ఈశ్వరయ్య, దయ్యాల నాగవేణి, సెక్రటరీలుగా సుధాకర్, తిప్పయ్య, రామచంద్ర, రామలింగ, వడ్డే శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆనంద్, చౌడప్ప, రామాంజనేయులు, శివానంద, మహేంద్ర, భరత్, రాముడు నియమితులయ్యారు. కల్చరల్ విభాగంలో ప్రెసిడెంట్‌గా బాబు ఈడిగ, వైస్ ప్రెసిడెంట్లుగా మారుతీ, పెద్ద వెంకటేష్, జనరల్ సెక్రటరీలుగా రాంపురం ఎర్రిస్వామి, సిద్ధప్ప, లక్ష్మన్న, శివరాజు. సెక్రటరీలుగా మల్లికార్జున, విజయభాస్కర నాయుడు, శ్రీరాములు, వన్నూరుస్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బసవరాజు, తులసీ నాయక్, నరేష్, గంగాధర్, వన్నూరప్పగారి ఓబన్న, అంజప్ప, మల్లేష్ నియమితులయ్యారు.

బెళుగుప్ప అనుబంధ కమిటీల ప్రకటన

బెళుగుప్ప: మండలంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. బీసీ విభాగంలో అధ్యక్షుడిగా కురుబ వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా గొల్ల రాము, కె.వెంకటేశులు, జనరల్ సెక్రటరీలుగా బోయ చిత్తప్ప, ఎర్రిస్వామి, రుద్రస్వామి, సెక్రటరీలుగా గోపాల్, వి.వెంకటేశ్, గొల్ల చిత్తప్ప, గొల్ల మారుతి, భక్త వత్సల, ఎగ్జిక్యూటివ్ సభ్య లుగా వి.రామ్‌మోహన్, వి.పెద్దన్న, మారెప్ప, సి.తిమ్మారెడ్డి, బి.దనుంజయ, చౌడప్ప, ఉమాదేవిని ప్రకటించారు. ఎస్టీసెల్ మండల అధ్యక్షుడిగా ఎస్ఎస్ శీనానాయక్, ఉపాధ్యక్షులుగా కమల్‌నాయక్, మూడ్ లక్ష్మానాయక్ , జనరల్ సెక్రటరీలుగా శంకర్‌నాయక్,ఎం.లక్ష్మానాయక్, పార్వతిబాయి, సెక్రటరీలుగా రవినాయక్, గోపాల్‌నాయక్, శివ నాయక్, చర ణ్‌నాయక్, బి.తిప్పేస్వామినాయక్, కార్యవర్గసభ్యులుగా మిథ్యానాయక్, యస్.శంకర్‌నాయక్, సునీల్‌నాయక్, మధు నాయక్, రఘు నాయక్, ఆనంద్ నాయక్, హనుమంతునాయక్, రాజునాయక్, కమలనాయక్‌ను ఎంపిక చేశారు.

విడపనకల్లు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విడపనకల్లు బీసీ సెల్, కల్చరల్ సంఘాల నాయకులను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బీసీ సెల్ మండల అధ్యక్షులు ఓబుళేసు, ఉపాధ్యక్షులు బద్రినాథ్, గిరిబాబు, జనరల్ సెక్రటరీలుగా మరి స్వామి, వన్నూరుస్వామి, ఎం.నాగరాజు, సెక్ర టరీలుగా మంజుల, మస్తాన్, మడకశి ర, కుడితిని రాముడు, మల్లికార్జున, హనుమంతు, కె.ఓబుళేసు, ఎస్.ఓబుళేసుతో పాటు ఎగ్జి క్యూటివ్ మెంబర్స్‌గా ఏడుగురిని నియమించా రు.

మండల కల్చరల్ విభాగం కమిటీ.. : అధ్యక్షుడిగా బోయ వీరాంజనేయులు,వైస్ ప్రెసిడెంట్లు గా మల్లికార్జునరెడ్డి, బోయ నారాయణస్వామి, జనరల్ సెక్రటరీలుగా అంజనయ్య, ఉలిగన్న, గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, సెక్రటరీలుగా బోయనాగరాజు, లక్ష్మన్న, నీలకంఠారెడ్డి, కె.లక్ష్మన్న,ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పేట్లో వెంకటేశులు, అనిల్, కె.వన్నూరుస్వామి, హనుమంతరెడ్డి, అమర్నాథ్, వడ్డే అనిల్ నియమించారు.

నగలు, మద్యం దుకాణాల్లో చోరీ

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్‌లో బుధవారం అర్ధరాత్రి తర్వాత నగలు, మద్యం దుకాణాల్లో భారీ చోరీ జరిగింది.సమాచారం అందుకున్న సీఐ వెంకటరమణ, డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్ ఎస్ఐలు గురుప్రసాదరెడ్డి, నాగమధు, నబీరసూల్, సిబ్బంది గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. అబ్దుల్ నజీర్‌ఖాన్‌కు చెందిన నగల దుకాణంలో రూ.14 లక్షలు విలువ చేసే 9 కిలోల వెండి, 30 గ్రాములకు పైగా బంగారాన్ని అపహరించినట్లుగా బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే ప్రైవేటు మద్యం దుకాణంలో రెండు రోజుల వ్యాపారానికి సంబంధించిన రూ.4 లక్షల నగదు, మద్యం బాక్సులు, సీసాలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు నమోదైంది.

కౌలు రైతు సంఘం కమిటీ ఏర్పాటు

విడపనకల్లు: వేల్పుమడుగులో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బోయ వెంకటేశులు ఆధ్వర్యంలో 15 మందితో కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. కౌలు రైతులు నరసింహులు, ఓబుళప్ప, నారాయణ స్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.